# త్రైలోక్యగీత
# చతుర్దశాధ్యాయము
# వర్ణవ్యవస్థా గాయత్రీ సమన్వయ యోగము

**త్రైలోక్యా ఉవాచ:-**

**బ్రూషే దత్త! సదా సత్యం, తమసస్త్వ పర భేద భిత్! |**
**అస్పృశ్య బ్రాహ్మణౌ కౌ చ సా గాయత్రీ ద్విజస్య కిమ్ || 14.1||**

[ ఓ దత్త దేవ! ఆధ్యాత్మిక జ్ఞానము నందు తమరు ఎల్లప్పుడు సత్యమునే పలుకుతారు. మంచి-చెడులను ప్రక్కన బెట్టి కొందరు తనవారు అని, కొందరు బయటివారు అనెడి అజ్ఞానము తమరికెప్పుడూ లేదు. అస్పృశ్యుడెవరు? బ్రాహ్మణుడెవరు? గాయత్రీ మంత్రము మరియు ఉపనయనము అనెడి క్రతువు ద్విజులకు మాత్రమే చెందినవా? బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులనబడు ద్విజులు ఎవరు? ]

**శ్రీశ్రీశ్రీ దత్తస్వామీ ఉవాచ:-**

**సత్య జ్ఞానే సదా లోలే! త్రైలోక్యే! గుణకీర్తనమ్ |**
**కులం లింగం మతం భాషాం, వినా దైవత్వముచ్యతే|| 14.2||**

[**శ్రీశ్రీశ్రీ దత్తస్వామి వచించారు:-** ఓ త్రైలోక్య! నీవు ఎల్లప్పుడు సత్యమైన జ్ఞానపిపాసను కలిగి ఉన్నావు. భగవంతుని విలువైన స్వభావమునే దివ్యత్వము అంటారు. కులము, లింగము, మతము మరియు భాషాబేధము లేకుండా ఇటువంటి దివ్య స్వభావములు ఎవరికున్ననూ అభినందనీయమే. ]

**న శ్రుతః పంచమః పాపీ, సర్వే నింద్యా బహిష్కృతాః |**
**గో మాతృ వృష తాతఘ్నః, నిరుద్ధశ్చాత్ర దండవత్ || 14.3||**

[వేదాలలో కేవలము నాలుగు వర్ణములనే చెప్పినందున ఐదవ వర్ణము గురించిన ప్రస్తావన వేదములో లేదు. నాలుగు వర్ణాలకు సంబంధించిన వారెవరైనా ఘోరపాపకర్మలను చేసినట్లైతే వారిని

సమాజము నుండి అస్పృశ్యులుగా వెలివేసెడివారు. అంతటి ఘోరపాపమేమిటంటే, తల్లి వలె ఎంతో కాలముగా పాలు ఇచ్చిన ఆవులు లేదా గేదెల పాలు తాగి, వృద్ధాప్యములో ఉన్న వాటిని చంపి తినడము. అలాగే తండ్రి వలె వ్యవసాయములో పొలము దున్నడానికి తోడైన ఎద్దు లేదా దున్నపోతులను వృద్ధాప్యములో చంపి తినడము. ఇది నిజముగా అస్పృశ్యత అనే శాబ్దిక అర్ధము కాదు, ఆయా పాపకర్మలు చేసిన జీవాత్మలలో మార్పును కోరుతూ ఏర్పాటైనది. ఒకవేళ ఏదైనా పాఠశాల లేదా కళాశాలలో డిబార్ అనే విధానముతో విద్యార్థులను బయటకు పంపుటకు కారణము ఆయా విద్యార్థులు విద్యాసంస్థలలో ఉండవలసిన క్రమశిక్షణను మీరి ప్రవర్తించడము. అటువంటి విద్యార్థులలో సత్పరివర్తనను ఉద్దేశించిన విధానము డిబార్, అంతే కాని పగను ప్రేరేపించునది కాదు.]

**దండితస్య సుతో నైవం, అస్పృశ్య స్స న సజ్జనః|**
**పరివర్తన మద్వేషః, కలౌ మూఢో హి పాఠకః || 14.4||**

[డిబార్ అయిన ఒకని కొడుకును పాఠశాలలో ప్రవేశము పొందుటను అడ్డుకోరాదు, ఎందుకంటే తండ్రి చేసిన అపరాధము(పాపకర్మ)నకు శిక్ష ఇదివరకే విధించబడినది. ఒకవ్యక్తి అపరాధి అయితే వాని సంతానము కూడా అపరాధి కానవసరం లేదు. ఇదే క్రమములో తండ్రి పాపము కారణముగా సంతానము అస్పృశ్యులు కానవసరము కూడా లేదు. తండ్రి కూడా మళ్ళీ పాపము చేయక మంచి వాడుగా ఉన్నపుడు శిక్షను పొడిగించరాదు. శిక్ష యొక్క లక్ష్యము కేవలము సత్పరివర్తన మాత్రమే, పగ కాదు. కలియుగములో ఇలాంటి అపార్థములు అనేకములు బయలుదేరినాయి, ఎందుకంటే జ్ఞానసాధకులైన విద్యార్థులు, సంస్కృత భాషా పరిజ్ఞానము లేనందున ధర్మగ్రంథములలో చెప్పబడిన విషయము అర్థము చేసుకోవడము మాని టేప్ రికార్డర్ వలె కేవలము శాస్త్రములలో చెప్పిన

విషయములను కంఠస్థము చేసి గుడ్డిగా వల్లెవేయడము ఆరంభించినారు.]

**అన్యోన్య ద్వేష ముత్సృజ్య, సత్యం జ్ఞేయం విమత్సరైః |**
**అవేదవిత్ బ్రాహ్మణో న, సంతో ఽన్యే బ్రాహ్మణా మతాః || 14.5||**

[ఉన్నత కులములు మరియు నిమ్న కులములుగా చెప్పబడేవారు పరస్పరము అసూయ, అహంకారముల వలన ఏర్పడిన పరస్పర ద్వేషమును వదలి వేసి, శాంతియుతంగా తెలుసుకోవలసిన సత్యమైన సిద్ధాంతము ఇదే. అదే విధముగా, వేదములలోని సారము యొక్క అర్థము తెలియనివాడు బ్రాహ్మణుడు అని గుర్తింపబడ కూడదు. ఇతర కులములలో పుట్టిన వారెవరైనా సరియైన వేదజ్ఞానము కలిగినట్లైతే వారిని బ్రాహ్మణులుగా భావింప వచ్చును.]

**రోమహర్షణ విప్రత్వం, చండాలన్యూన రావణః |**
**గుణ కర్మభి రావ్యక్తైః, కులం సర్వస్య నోద్భవాత్ || 14.6||**

[రోమహర్షణుడు నిమ్న కులములో పుట్టిన వాడైనా, నైమిశారణ్యములో యజ్ఞము చేయునపుడు బ్రాహ్మణుడిగా గౌరవింపబడినాడు. రావణుడు బ్రాహ్మణ కులములో పుట్టినప్పటికీ, అతడు అస్పృశ్యుల కంటే నీచమైన వాడుగా భావింపబడినాడు. కావున కర్మల ద్వారా బహిర్గతమైన గుణస్వభావములే మనిషి కులమును నిర్ణయించగలవు కాని జన్మ ఆధారముగా కాదు.]

**జన్మనా శ్రుత మన్వర్థం, గుణవర్ణే జనిం వ్రజేత్ |**
**సహకారాయ సిద్ధం తే, సర్వే సంతి క ఆగ్రహః || 14.7||**

[కొందరు అజ్ఞానులు, జన్మను బట్టి కులము నిర్ణయింపబడుతుంది అంటారు. ఎందుకంటే, చెడు గుణస్వభావములు గల జీవాత్మలు నిమ్నకులాలలోను, ఉత్తమ గుణస్వభావములు గల జీవాత్మలు అగ్రకులాలలోను జన్మిస్తాయని వేదము చెప్తుంది (**కపూయచరణాః కపూయ యోనిమ్…వేదము**) అని అంటారు.

ఈ సిద్ధాంతము సరియైనదైతే పైన చెప్పిన ఉదాహరణ దీనిని అసత్యమని నిరూపిస్తున్నది. ఉత్తమ జీవాత్మ అగ్రకులములో జన్మించినపుడు, ఆ జీవుడు ఎందుకు తన ఉత్తమ గుణస్వభావములను ఉత్తమ కర్మల ద్వారా ప్రదర్శించుట లేదు? అంటే మనము వేదమును వ్యతిరేకిస్తున్నామన్నమాట! ఇక్కడ **మేము** చెప్పదలచుకున్నది ఏమిటంటే, *ఒక ఉత్తమ జీవాత్మ ఉన్నత కుటుంబములో జన్మిస్తున్నది అనగా గుణస్వభావముల రీత్యా అది ఉత్తమ కులముగా ఎంచబడినది అని వేదార్థమును తీసుకొనవలెను. అంతే కాని, జన్మించిన వంశపు తరతరాల జన్మ చరిత్ర ఆధారముగా కులమును నిర్ణయించరాదు.* ఈ దిశలో చూసినట్లైతే వేదవాక్కు సమన్వయము అవుతుంది. వ్యక్తిగతముగా ఉత్తమ గుణస్వభావములున్న వాడిదే ఉన్నత కులము అని వేదప్రమాణము తప్ప ఏదో లోకము అనుకునే జన్మ నిర్ధారిత అగ్రకులములో జన్మించడము వలన కాదు. మంచి గుణస్వభావములు గల ఒక జీవాత్మకు, మంచి కుటుంబములో గనక జన్మ లభించినట్లైతే, ఆ జీవాత్మకు ఆ కుటుంబపు మంచి వాతావరణము సహాయకారిగా ఉండగలదని వేదము యొక్క యథార్థమైన లక్ష్యము. అంటే ఒక ఉత్తమ జీవాత్మకు సహాయము చేయటము. ఇక్కడ నేను మీ సిద్ధాంతమునే అంగీకరిస్తూనే మీ సిద్ధాంతమునకు ఒక అదనపు విషయమును చేర్చుచున్నాను. **మేము** కూర్చిన అదనపు విషయము ఏమిటంటే – మంచి జీవాత్మ, ఉత్తమ కులములో అంటే ఉత్తమ గుణస్వభావములు గల కుటుంబములో (జన్మరీత్యా అగ్రకులము అనబడేది కాదు), జన్మించినపుడు తన ఉత్తమ గుణస్వభావములను కర్మల యందు ప్రదర్శించడానికి ఏ మాత్రమూ సంశయించదు. 1. మంచి జీవాత్మ, మంచి గుణస్వభావములు కలది 2. మంచి కులపు కుటుంబములో జన్మించుటకు నిర్దేశింపబడినది. 3. తన ఉత్తమ గుణస్వభావములను కర్మల ద్వారా ప్రదర్శించునది. 1వ, 2వ అంశములు (నీ సిద్ధాంతమును) నీవు అంగీకరిస్తే 3వ అంశము (మా సిద్ధాంతమును) కూడా నీవు అంగీకరించాలి. ఒకవేళ 1వ మరియు

2వ అంశములను అంగీకరించి 3వ అంశమును నిరాకరించడము తర్కయుక్తము కాదు. కులమును నిర్ణయించడానికి ఈ మూడు అంశములను అంగీకరించవలసినదే. ఒకవేళ నీవు మీ సిద్ధాంతమును 99% జీవులకు స్వీకరించి, కేవలము 1% మాత్రమే మా ఉదాహరణలు సమకూర్చాము అని అంటావేమో -- మరి 99% ఉదాహరణలతో సరియైన మీ సిద్ధాంతము కంటే 100% ఉదాహరణలతో సరియైన మా సిద్ధాంతమును స్వీకరించడము మంచి నిర్ణయము కాదా? మా సిద్ధాంతములో నీవు చెప్పిన ఉదాహరణలతో పాటు, అదనముగా మా ఉదాహరణలు కూడా సమన్వయించినపుడు, మా సిద్ధాంతమును నీవు వ్యతిరేకించడము ఎందుకు? నిజానికి మా సిద్ధాంతము కూడా నీ సిద్ధాంతమే, దానికి ఒక్క మూడవ (3.)అంశము మాత్రమే అదనముగా చేర్చబడినది, అంతే.

యథార్థముగా వేదములో చెప్పిన 'కపూయయోనిః' అను శబ్దమునకు 'చెడ్డ నిమ్న కులము' అను అర్థమును నీవు ప్రతిపాదించినావు. ఇది ఏ మాత్రమూ సరి కాదు. ఏలననగా, కపూయయోని శబ్దము ఒక కులమును గాని కనీసము ఒక కుటుంబమును గాని చెప్పదు. ఈ శబ్దము కేవలము ఒక చెడ్డ మాతృగర్భమును గురించి సూచించుచున్నది. అనగా, ఒక చెడ్డ జీవాత్మ ఒక చెడ్డ మాతృగర్భమున పుట్టును అనియే అర్థము. ఈ శబ్దమునకు నీవు ఒక చెడ్డ వ్యక్తిని (మాతను) చెప్పుట వదలి, కనీసము ఒక చెడ్డ కుటుంబము అను అర్థమును కూడా వదలి, ఒక చెడ్డ కులము అని తప్పుడు అర్థమును చెప్పుచున్నావు. చెడ్డ కులము అను అర్థమే ఈ శబ్దమునకు రానపుడు, ఆ చెడ్డ కులము నిమ్న కులమని అధిక కవిత్వమును చెప్పుచున్నావు!]

**బహుజన్మ గుణా నిత్యాః, ప్రభావాదేక జన్మనః |**
**అపవాదాః క్వచిత్ న్యాయః, సర్వ దృష్టాంత సంగ్రహః ||**
**14.8||**

[తన చుట్టు ఉన్న వాతావరణములోని గుణ స్వభావములను జీవాత్మ సంగ్రహిస్తుంది. అవి తల్లిదండ్రుల రక్తసంబంధము వలన సంక్రమించవు. ఈ భూమిపై జన్మించబోయే ఆత్మ ఇదివరకే అనేక జన్మల నుండి తాను సంగ్రహించిన విశేషమైన గుణస్వభావములలో నానుతూ ఉన్నది. జీవాత్మలో అంతర్లీనమైన అనేక జన్మ సంస్కార రూపములైన ఈ గుణస్వభావములు చాలా చాలా బలిష్ఠముగా ఉండుట చేత జన్మించిన తర్వాత ఈ కొత్త జన్మ తల్లిదండ్రుల ప్రభావమునకు లోను కాలేవు. జీవుడు వ్యక్తపరచే గుణస్వభావములన్నీ అంతర్లీనముగా బహుజన్మ సంస్కారముల ద్వారా వచ్చినవే. కావున ఒక విశేషమైన వాతావరణములో జీవాత్మ జన్మించినప్పటికీ, ఆ విశేషవాతావరణము జీవాత్మలో అంతర్లీనమైన బహుజన్మ సంస్కార-గుణస్వభావములకు దోహదకారిగా ఉంటుంది. కావుననే, జీవాత్మ యొక్క బహుజన్మ సంస్కార-గుణస్వభావమును అనుసరించియే దాని దోహదకారియగు సమాన గుణములు గల కులములోనే ఆ జీవాత్మ జన్మించుచున్నది. జీవాత్మ యొక్క బహుజన్మ సంస్కార-గుణస్వభావముల ఆధారముగా మాత్రమే కులము పేరు ఇవ్వబడాలి. దీనిని అనుసరించి కుటుంబము యొక్క సాధారణ కులమును జీవాత్మ కులముగా చెప్పలేము. ఈ సాధారణ సూత్రమునకు కొన్ని మినహాయింపులు ఉన్నాయి. ఒక చెడ్డ జీవాత్మ కూడా ప్రత్యేక సందర్భములో ఏదైనా మంచి కుటుంబములో జన్మించవచ్చును. ఇలాంటి విశేష సందర్భాలలో ఈ సాధారణ సూత్రము వర్తించదు. కావున అన్ని సందర్భాలలో జీవాత్మ ప్రదర్శించే కర్మల నేపథ్యములో గల గుణస్వభావముల ఆధారముగా కులము నిర్ణయించడము శ్రేష్ఠమైన విధానము. ఎలాంటి మినహాయింపు లేకుండా ప్రతి విశేష సందర్భములో కూడా విజయవంతముగా కులమును నిర్ణయించడములో 'కర్మల ద్వారా ప్రదర్శించిన జీవాత్మ గుణస్వభావముల ఆధారముగానే జీవాత్మ కులము నిర్ణయించాలి' అనే ఈ సూత్రము తప్పక వర్తిస్తుంది. ]

**ప్రస్థానాభ్యాం కుటుంబస్య, న కులస్య గుణాన్వయః |**
**ఆద్యే దృష్టే హ్యలం నాన్యత్, గుణ వ్యక్తేస్తు నిశ్చయః || 14.9||**

[వేదములను అనుసరించి, పాపకర్మలు చేసిన జీవాత్మ పాపభూయిష్ఠమైన కులములోను, పుణ్యకర్మలు చేసిన జీవాత్మ శ్రేష్ఠమైన గుణస్వభావములు గల కులములోను జన్మిస్తుంది. భగవద్గీతను అనుసరించి జీవాత్మ గుణస్వభావములను బట్టి కులము నిర్ణయింపబడుతుందని తెలిపినది. ఈ రెండు గ్రంథములు పవిత్రమైన, ప్రామాణికమైన ప్రస్థాన గ్రంథములు. ఈ రెండు భావనలను కలిపిన మీదట తుదినిర్ణయము ఏమిటంటే పుణ్యాత్ముడు ఒక శ్రేష్ఠమైన గుణస్వభావములు గల కుటుంబములో జన్మిస్తాడు. అయితే, కుటుంబ శ్రేష్ఠత్వమును జన్మ ఆధారిత కులవ్యవస్థను బట్టి నిర్ణయింపరాదు. కులము శ్రేష్ఠమైనది కావచ్చు, కాని అందులోని ఒక కుటుంబము ఉత్తమమైనది కాకపోవచ్చును. కాని నీవు ఆ కుటుంబము శ్రేష్ఠమైన కులమునకు చెందినది కావున శ్రేష్ఠమైన కుటుంబము అని నిర్ణయిస్తున్నావు. కాని కుటుంబము ఒక్కోసారి చెడ్డది కూడా కావచ్చును. అలాగే ఒకవేళ ఒక పుణ్యాత్మ, మంచి కులములోని చెడ్డ కుటుంబములో జన్మించినట్లైతే ఉత్తమలక్ష్యము నెరవేరదు. మంచికులమునకు చెందినదైనా లేక చెడ్డ కులమునకు చెందినదైనా కుటుంబము ఉత్తమమైన గుణస్వభావములు కలిగి ఉంటేనే ఆ కుటుంబమును మంచిది అంటాము, ప్రస్తుతము చెప్పేదేమిటంటే ఈ కుటుంబము యొక్క కులమే మంచి కులము అని కూడా చెప్పాలి. ఈ విధముగా నీవు వేదములోని అంశాలను, భగవద్గీత లోని అంశాలను సమన్వయము చేయాలి. ఈ బోధనల పూర్తి సారాంశము ఏమిటంటే ఒక కుటుంబము కాని లేదా ఒక జీవాత్మ కాని కర్మల ద్వారా ప్రదర్శించిన గుణస్వభావముల ఆధారముగా మాత్రమే వారి కులమును నిర్ణయించాలి కాని జన్మను బట్టి మాత్రము కాదు.]

**ఆకర్షణాత్ స్వభావానాం, తథా వ్యత్యయ దర్శనమ్ |**
**పరివర్తన దృష్ట్యా స్యాత్, కులం వ్యష్టి గుణాశ్రితమ్ || 14.10||**

[ మంచి గుణస్వభావములు గల జీవాత్మ మంచి కుటుంబములో జన్మిస్తుంది, అలాగే చెడ్డ గుణస్వభావములు గల జీవాత్మ చెడ్డ కుటుంబములో జన్మిస్తుంది. కారణము, సమానమైన స్వభావముల మధ్య గల ఆకర్షణ. ఈ విధానము ఎలాంటిదంటే ప్రభుత్వము చేత అనుసరించబడి ప్రజల చేత నిరసించబడే విధానము, అంటే ధనవంతుడు మరింత ధనవంతుడు అవుతాడు, పేదవాడు మరింత పేదవాడు అవుతాడు. కాని పరస్పర సమాన స్వభావముల మధ్య ఆకర్షణ కారణముగా దీనిని నివారించలేము. ఒకవేళ అక్కడ కొంచెము అవకాశమున్నా భగవంతుడు, 1. ఒక మంచి జీవాత్మ ఏదైనా ఒక చిన్న పాపకర్మ చేసినట్లైతే తనను ఒక చెడ్డ కుటుంబములో పుట్టించి వారి అందరి అభ్యున్నతికి కారణము అవుతాడు. 2. ఒక చెడ్డ జీవాత్మ చేసిన చిన్న పుణ్య కర్మ కారణంగా దానిని ఒక శ్రేష్ఠమైన కుటుంబములో పుట్టించి ఆ మంచి వాతావరణము చేత ఆ జీవాత్మను ఉద్ధరించ గలడు. ఇవి పై సందర్భములో మినహాయించిన ప్రత్యేక ఉదాహరణలు. ఈ సందర్భములలో ప్రతి ఒక్క జీవాత్మ యొక్క కులమును కేవలము తన కర్మల వలన ప్రదర్శింపబడిన వాని అంతర్లీనమైన (అనేక జన్మసంస్కారములు) గుణస్వభావముల ఆధారముగా నిర్ణయించాలి, కాని వాని జన్మ ఆధారముగా ఆ కుటుంబమునకు ఇదివరకు కేటాయించబడిన కులము ఇక అవసరము లేదు. ]

**శృతా వంగ గుణా జ్జన్మ, పరం కర్మ చ తత్పరమ్ |**
**గుణాను నిశ్చితో వర్ణః, న జనేరితి సమ్మతః || 14.11||**

[భగవంతుని దివ్య శరీరము లోని నాలుగు విశేష అవయవముల గుణస్వభావములను కూడి మొదటి నాలుగు జీవాత్మలు పుట్టాయి. 'బ్రాహ్మణ జీవాత్మ భగవంతుని తలభాగము నుండి పుట్టినది', ఈ వాక్యము వివరము తెలియగా, జ్ఞానము

మరియు మేథాశక్తి సమాజమునకు ఆధ్యాత్మిక జ్ఞానమును బోధించుటకు అవసరము. మొట్టమొదటి బ్రాహ్మణుడు జన్మరీత్యా బ్రాహ్మణుడు, ఎందువలన అంటే అది భగవంతుని ప్రణాళికలో భాగము. ఇలా మొట్టమొదటి బ్రాహ్మణుడి జీవాత్మకు సత్త్వము లేదా జ్ఞానము అను గుణము ఉండుట చేత మరియు ఆచరణ రీత్యా బ్రాహ్మణుడు అగుట చేత మనము తనను బ్రాహ్మణునిగా అంగీకరించినాము. ఇప్పుడు ఇతనికి సంతానముగా జన్మించిన వానికి జన్మరీత్యా బ్రాహ్మణత్వము ఇవ్వబడలేదు. గుణ స్వభావములను బట్టి మాత్రమే అతడు బ్రాహ్మణుడని నిర్ణయించబడినది. (**గుణకర్మ విభాగశః…**గీతా). ఈ విధముగా జన్మరీత్యా బ్రాహ్మణుడు అని కులము నిర్ణయించడము అనేది భగవంతుడు సృష్టించిన మొదటి బ్రాహ్మణునితోనే అంతము అయినది. గుణస్వభావములను బట్టి కులము నిర్ణయించడము, జన్మ ఆధారముగా కులమును నిర్ణయించకపోవడము అనేది మొదటి బ్రాహ్మణుని సంతానము నుండి మొదలుకొని ఈనాటి వరకు కూడా కొనసాగి, ఇంకా భవిష్యత్ లోనూ కొనసాగగలదు. ఈ కారణము చేత శ్రీ కృష్ణుడు తన శరీర అవయవముల నుండి జన్మించిన నాలుగు వేర్వేరు వర్ణములు, వాటి మూలమైన అవయవముల గుణస్వభావముల ననుసరించి ఉన్నటువంటి మొదటి నాలుగు జీవాత్మలను తానే సృష్టించానని తెలిపినాడు. (**చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్…**గీత). ఇదే సిద్ధాంత పరిణామము మిగిలిన మూడు కులముల విషయములోను వర్తిస్తుంది. క్షత్రియులు జన్మించిన అవయవము-బాహువులు, శక్తి (రజో గుణస్వభావముల)కు ప్రతీకలై తల(సత్త్వము, జ్ఞానము) చేత నియంత్రించ బడతాయి. ఊరువుల నుండి వైశ్యులు జన్మించారు, అంటే స్థిరముగా కూర్చున్న సంపద లేదా లక్ష్మీదేవి కూర్చున్న శ్రీమహావిష్ణువు తొడల వంటి వారని అర్థము. భూమిని ఎక్కువగా తాకుతూ ఉండే పాదముల నుండి శూద్రులు జన్మించారు అంటే, భూమితో వ్యవసాయము చేసేవారని అర్థము. దేవుని అవయవముల నుండి నాలుగు వర్ణముల జీవాత్మలు సృష్టించబడినపుడు వర్ణములలో భేదమే తప్ప ఎక్కువ

తక్కువలు లేవు. శూద్రుని పాదముల నుండి పుట్టించుటలో వాని స్థితి తక్కువయని కాదు. దేవుని పాదముల నుండి పరమ పవిత్రమైన గంగానది పుట్టినది యని జ్ఞాపకము చేసుకొనవలెను.

ఇచ్చట మొదటి తరము అనగా కృతయుగములోని అన్ని తరములను సూచించును. కృతయుగములో అన్ని తరములలో దైవదత్తమైన స్వేచ్ఛ లేనందున ప్రతి జీవుడును తన తల్లిదండ్రుల గుణకర్మలనే స్వీకరించెడివాడు. కావున, జన్మ ఆధారముగా వర్ణవ్యవస్థ అను సిద్ధాంతమునకు కృతయుగమంతయూ సహకరించుచున్నది. కృతయుగానంతరము త్రేతాయుగము వచ్చినపుడు దైవదత్తమైన స్వేచ్ఛను ప్రతిజీవుడును పొందుట వలన కనీసము కొందరు జీవులైననూ అన్యకులముల గుణముల పట్ల ఆకర్షితులై జన్మ చేత కులము అను వర్ణవ్యవస్థను అతిక్రమించిరి. ఇట్టి సందర్భములో జీవుని యొక్క కులము తాను పుట్టిన కులమును బట్టి గాక, తనలో సంక్రమించిన గుణములను బట్టియే నిర్ణయించవలసి వచ్చినది.]

**గుణాద్వర్ణః శ్రుతో వృత్తౌ, రామ కృష్ణార్చనం ద్విజైః |**
**పూజితౌ శబరీ వ్యాధౌ, రావణో బ్రాహ్మణో న హి || 14.12||**

[కులము కేవలము గుణస్వభావముల ఆధారంగా నిర్ణయింపబడుతుందని, జన్మ కారణముగా కాదని వేదములు స్పష్టముగా ఘోషించాయి. ఒక ఆచార్యుని చేత సత్యకామ జాబాలుడను బాలుడు సత్యమును పలికినందుకు బ్రాహ్మణుడని నిర్ణయించబడినాడు. దీనిని బట్టి సత్యమును పలుకువాడు, ఎవరైనా బ్రాహ్మణుడేనని తెలుస్తుంది. అంతే కాని, బ్రాహ్మణ కులములో జన్మించిన వాడెప్పుడూ సత్యమునే పలుకుతాడని దీని అర్థము కాదు. అదేవిధంగా జనశ్రుతి ఎప్పుడూ ఎక్కువగా చింతిస్తూ ఉండేవాడు, కావున అతడు క్షత్రియుడిగా జన్మించినప్పటికీ శూద్రుడని రైక్వ మహర్షి చేత చెప్పబడినాడు. శూద్ర అనే శబ్దమునకు అర్థము చింత. (**శోచతి ఇతి శూద్రః**).

రాముడు క్షత్రియకులములో జన్మించాడు, కృష్ణుడు యాదవకులములో (వెనకబడిన తరగతి) జన్మించాడు. కాని అప్పటి నుండి ఇప్పటి దాకా వారి పాదములు బ్రాహ్మణుల చేత కడుగబడుతూనే ఉన్నాయి. బ్రాహ్మణుల పూజాగదులలో శబరి మరియు తిన్నడు (షెడ్యూల్డ్ తరగతి మరియు తెగలకు చెందిన వారు) మొదలైన పరమభక్తుల ఫొటోలు అప్పటి నుండి ఇప్పటి దాకా బ్రాహ్మణ గృహములందు కూడ పూజింప బడుతూనే ఉన్నాయి. రావణుడు బ్రాహ్మణునిగా జన్మించిననూ అతని ఫోటో అప్పటి నుండి ఇప్పటి దాకా ఎప్పుడూ పూజింపబడ లేదు. పై ఉదాహరణల నుండి బ్రాహ్మణ పూర్వీకులు, ఋషులు మొదలైన వారు జన్మ ఆధారముగా కాక మానవుడు జీవితములో వ్యక్తము చేసిన గుణస్వభావముల ఆధారముగా అతని కులమును నిర్ణయించినారని తెలుస్తుంది. కలియుగములో జన్మరీత్యా బ్రాహ్మణులుగా ఉన్నవారే పురోహితులుగా ఉండి కులవ్యవస్థలో ఇలాంటి అజ్ఞాన ఒరవడికి బాధ్యులైనారు. ఎందుకంటే పురోహితులు పవిత్ర గ్రంథములను గ్రుడ్డిగా వల్లెవేస్తున్నారు, వాటి అంతరార్థమును విచారించడము లేదు, సత్యమార్గము ఏదో దానిని పట్టించుకోవడము లేదు. ]

**జన్మనా జాయతే శూద్రః, కర్మణా జాయతే ద్విజః |**
**అధ్యాహార్య స్సర్వ శబ్దో, బ్రహ్మ బంధు రితీర్యతే || 14.13||**

[జన్మరీత్యానే శూద్రులు పుడతారని, ద్విజులైన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మాత్రము తాము చేసిన కర్మల చేత పుడతారనే శ్లోకమొకటి లోకంలో బహుళ ప్రచారములో ఉన్నది. ఈ శ్లోకములో ప్రతిచోట 'ప్రతిఒక్కరు (**సర్వః)**' అనే శబ్దప్రయోగమును అధ్యాహారముగా చేయాలి. అప్పుడే అర్థసమన్వయము అవుతుంది. దీని అర్థము ఏమిటంటే పుట్టినప్పుడు ప్రతి జీవాత్మ శూద్రుడే, ఎందుకంటే పుట్టిన ప్రతి శిశువు ఏడుస్తూనే ఉంటాడు. శూద్రుడనే శబ్దానికి అర్థము ప్రవృత్తి చింత మరియు ఏడ్చుట

(**శోచతి ఇతి శూద్రః**). ఒకవేళ బ్రాహ్మణ కులములో (గుణ స్వభావముల చేత) బ్రాహ్మణుడిగా పుట్టి, బ్రాహ్మణ స్వభావములను, కర్మలను సాధన చేయకపోతే తనను 'బ్రహ్మబంధు' అని మాత్రమే అనాలి, కాని బ్రాహ్మణుడు అని కాదు. ఈ శ్లోకము స్వార్థపరులైన కలియుగ పురోహితుల చేత ఇలా వివరింపబడినది. "బ్రాహ్మణ కులములో శిశువు జన్మిస్తే, అతడు ఉపనయనము అనే క్రతువు జరిగే వరకు శూద్రుడు అనబడతాడు. ఆ తర్వాతనే అతడు ద్విజుడు(బ్రాహ్మణుడు) అనబడతాడు". ఇదే సూత్రము క్షత్రియులకు మరియు వైశ్యులకు కూడా వర్తించబడుతుందని వారి వాదము. కాని ఈ సూత్రీకరణ సరియైనది కాదు, ఎందుకంటే, మొదటి కారణము, ఇది కేవలము మూడు కులముల నేపథ్యమునే వహిస్తున్నది. రెండవది, ఇటువంటి నిర్ధారణ చేయుటకు ప్రమాణమును చూపలేదు. యథార్థముగా ఈ శ్లోకము భూమిపై జన్మించిన అందరికీ వర్తిస్తుంది, ఎందుకంటే కులము గుణముల ఆధారభూతమైనది, మరియు గుణములు జన్మపై ఆధారపడి ఉండవు. కావున, ఈ శ్లోకభావము ఏమనగా – ప్రతి జీవుడును జన్మ చేత శూద్రుడే. అలానే, ఏ జీవుడైనా సద్గుణ-సత్కర్మల చేత ద్విజునిగా మారగలడు. ]

**జన్మనా కర్మనా చేతే, కథ్యతే సర్వ వర్ణజః |**
**కల్పితః కుల విద్వేషః, మత విచ్ఛిత్తయే ఖలైః || 14.14||**

[ ఏ కులములో జన్మించిన జీవాత్మకైనా రెండు కులము పేర్లు చెప్పబడాలి, అయితే వీటికి కులము పేరుకు ముందు రెండు ఉపసర్గలు ఉండాలి. 'జన్మణ (పుట్టుకతో)' మరియు 'కర్మణ(గుణస్వభావముల చేత)'. ఉదాహరణకు ఒక జీవాత్మ బ్రాహ్మణ కులంలో జన్మించి, అస్పృష్యుని వలె వ్యవహరించినట్లైతే తనను అనవలసినది, ***జన్మ బ్రాహ్మణః కర్మ ఛండాలః***. వేరొక జీవాత్మ ఛండాలకులంలో జన్మించి బ్రాహ్మణుని వలె ప్రవర్తించినట్లైతే ***జన్మ ఛండాలః కర్మ బ్రాహ్మణః.*** ప్రస్తుతం

ప్రాచుర్యంలో ఉన్న కులగుర్తింపు ప్రక్రియ ఎలాంటిదంటే మిగతా కులాల వారిలో ద్వేషభావమును రేకెత్తిస్తూ, పలువురు ప్రతినాయకుల పాత్రలకు జన్మలనిచ్చి పోషించుటకు ఆధారభూతమైనదై హిందూధర్మమును విభజిస్తూ తద్వారా బలహీనపరుస్తుంది. ]

**మతానామేకతానో దృక్, ఉచ్ఛిష్టా జల కల్పనా|**
**వ్యాఘ్ర మేష కథా జ్ఞేయ, కలౌ వర్ణాంతర ద్విశాం || 14.15||**

[ ఈ రోజుల్లో ఇతర కులాల వారిని ద్వేషించడము ఎంతగా పెరిగినది అంటే మనము త్రాగునీటిని కలుషితము చేసిన పులి-మేక కథను గుర్తు తెచ్చుకోవచ్చును. పులి ఎత్తైన స్థానంలో నిలబడి ఉంటుంది, మేక కొంత తక్కువ ఎత్తున నిలబడుతుంది. అవి రెండు పైనుండి క్రిందకు పారుతున్న ప్రవాహములోని నీటిని త్రాగుతూ దాహం తీర్చుకుంటున్నాయి. మేక నోటితో నీటిని త్రాగడం ద్వారా ప్రవాహపు నీటినంతా కలుషితము చేసిందని, మేకపై పులి అభియోగము మోపింది. నిజానికి పులి ద్వారా కలుషితమైన నీటినే తాను త్రాగుతున్నానని మేక వినయంగా తెలిపింది. దానికి స్పందిస్తూ పులి ఇంతకు పూర్వమే ఒకనాడు తాను క్రింద స్థానంలో నిలబడి నీరు త్రాగుతుండగా, ఈ మేక యొక్క తాత ఒకడు ఎత్తైన స్థానంలో(ప్రస్తుతము తానున్న స్థానము) నిలబడి నోటితో నీరు త్రాగి ప్రవాహమును కలుషితం చేసి ఉండెనని కాబట్టి దానికి పర్యవసానముగా ఇప్పుడు పులి మేక పైకి దూకి చంపివేసింది. అదే విధంగా ఒక వ్యక్తి మరొక వ్యక్తితో, ఆతని పూర్వీకులు తన పూర్వీకులను అవమానపరచాడనో లేక హాని కలుగజేసాడనో ఉద్వేగముతో అంటుంటారు! ]

**వినాశ్య హి కులద్వేషం, ప్రేమ్నా జీవంతు సోదరః |**
**దైవాదేక పితుర్జాతః, గీయతే స పరః పితాః || 14.16||**

[ఏ రెండు కులముల మధ్యనున్న ద్వేషభావమైనా ఆధ్యాత్మిక జ్ఞాన చింతన సహాయంతో అంతమవ్వాలి. మరియు జనులంతా భగవంతుడనే ఒకే తండ్రికి పుట్టిన వారు కనుక పరస్పరం సోదరభావంతో ఉండాలి. అన్ని కులములు ఒకే భగవంతుని నుండే పుట్టినాయని వేదములు ఘోషిస్తున్నాయి. భగవద్గీత అందరి తండ్రి భగవంతుడేనని దృవీకరస్తుంది. (**అహం బీజప్రదం పితా...***గీతా*).]

**గాయంతం త్రాయతే బ్రహ్మ, స దత్తః సవితోచ్యతే |**
**గాయత్ర్యా ఛందసా గీతిః, పద్యాద్గద్యాత్ పరా శ్రుతిః ||14.17||**

[వేదములలో గాయత్రి అనబడే ప్రత్యేకమైన ప్రార్థన ఏదీ లేదు. గాయత్రి అనేది కేవలం ఒక సంస్కృత పద్యము యొక్క ఛందస్సు. గాయత్రి మంత్రము అనబడు శ్లోకము ద్వారా పూజింప బడతున్న దైవము బ్రహ్మదేవుడు, అంటే దత్త దేవుడు తానే అయినవాడు. సవిత అనే పేరు గలవాడు (సవిత అనగా ప్రాణులను ప్రసవించిన వాడు - **సూంగ్ ప్రాణి ప్రసవే - సూతే ప్రాణినః ఇతి సవితా**). ఈ రెండు విషయములు సంధ్యావందనము అను క్రతువు లో తెలుపబడినవి. (**గాయత్రీ ఛందః, సవితా దేవతా**). గాయత్రి అంటే మధురగీతముల ద్వారా భగవంతుని ఆరాధించగల ఒక విధానము అని తెలుపునది. యజుర్వేదము - గద్యము, ఋగ్వేదము - పద్యము, సామవేదము - గీతము. గీతము, పద్యము కంటే మధురమైనది, పద్యము, గద్యము కంటే మధురమైనది. ఈ కారణం చేత సామవేదము అత్యంత శ్రేష్ఠమైనదని కీర్తించబడినది (**వేదానాం సామవేదోస్మి..** గీతా).]

**సామీప్యగమనం తస్య, ప్రోక్తోప నయనం మతం |**
**గానేన సర్వ జీవానాం, వినా వర్ణాది మీక్ష్యతాం || 14.18||**

[ ఉపనయనము అనేది యథార్థముగా క్రతువు కాదు. దీని అర్థము ఏమిటంటే, భగవంతుని కీర్తిస్తూ పాడే మధురమైన గీతాలాపనల ద్వారా భగవంతునికి బాగా దగ్గర కావడము. ఏ జీవాత్మ అయినా ఏ కులము , ఏ లింగమైనా, ఏ ప్రాంతానికి చెందినా, ఏ భాషీయులైనా కేవలము మానవుడుగా జన్మించినందుకు భగవంతుని కీర్తించు అర్హత గలిగిన వాడే మరియు ఈ మార్గములో భగవంతుని దరికి చేరగలవాడే. గాయత్రి మరియు ఉపనయనము అను రెండు భావనల సారాంశం కూడా నిజానికి ఇదే. జ్ఞానులు ఇట్టి అంతరార్థమును అర్థము చేసుకోవాలి.]

**సర్వేశాం విశ్వ జీవానాం, మిత్రో యస్మా దృషిః స్మృతాః |**
**విశ్వమిత్రోన్యథా తేషాం, అమిత్ర ఇతి కథ్యతాం || 14.19 ||**

[ ఈ విధముగా మధురగీతముల ఆలాపన ద్వారా భగవంతుని ఆరాధించిన ఋషి విశ్వామిత్రుడు. తన పేరుకు అర్థం ఏమిటంటే, సృష్టిలోని జీవాత్మలన్నింటికీ కుల,లింగ, ప్రాంత, భాషాబేదము లేకుండా అందరికీ మిత్రుడు. కలియుగంలోని వర్తమాన పురోహితులు అందరు అజ్ఞానులు కావున గాయత్రి అనునది, వేదములలో చెప్పబడిన విశేష ప్రార్థనామంత్రము అని, దానిని కొన్ని కులముల వారే చదవుటకు అర్హులని చెబుతున్నారు. వీరి దృష్టితో చూసినపుడు ఆ ఋషి యొక్క పేరు వ్యతిరేక కోణములో, అంటే ఈ సృష్టిలో అందరికీ మిత్రుడు కాడని( **విశ్వ+ అమిత్ర = విశ్వామిత్ర** ) అనవలసి వస్తుంది.]

**బాల్యం మధుర గానాయ, పఠ్యతే పురుషైః కథమ్ ? |**
**వ్రతేషు గీయతే స్త్రీభిః, దేవతా చేన్న కిం స్త్రియామ్? || 14.20||**

[బాల్యావస్థలో ఉన్న జీవాత్మలకు ఈ విధమైన భగవదారాధనా విధానము అనుకూలమైనది ఎందుకంటే ఎల్లప్పుడు బాల్యస్వరములందు భగవంతుని కీర్తనలు ఎంతో మధురంగా ఉంటాయి. పురుషులు ఎలా గాయత్రిని పాడకుండా (గాయత్రి

అంటే మధురమైన గీతము, అది ఏ మతమైనా, ఏ భాషలోనైనా భగవంతుని కీర్తిస్తూ ఉండే గీతము) కేవలము చదువుతున్నారు?. కావున గాయత్రి పురుష జీవాత్మలతో లేదు అని తేలింది. స్త్రీలు భగవంతుని పూజించుకునే విధానములు అయిన వ్రతములు (నోములు) మొదలైన సందర్భములలో భగవంతుని గురించిన మధురమైన గీతాలను పాడుకుంటుంటారు, కాబట్టి నిజానికి గాయత్రి స్త్రీలతోనే ఉన్నది. గాయత్రి అనేది గానముతో కూడిన భగవదారాధన మాత్రమే, ఇందులో స్త్రీ దేవతామూర్తి లేనే లేదు, ఇది కేవలము గాయత్రి అను పేరుగల చంధస్సులో రచింపబడిన ఒక శ్లోకవిశేషము (తత్సవితుర్వరేణ్యం..) మాత్రమే. అయితే బ్రహ్మదేవునికి మూడు కాలాలలో ముగ్గురు భార్యలుంటారు. ఉదయాన గాయత్రి, మధ్యాహ్న సమయములో సావిత్రి, సాయంత్రములో సరస్వతి. గాయత్రి అనే స్త్రీరూపములో దేవతా స్వరూపమును ఆరాధిస్తూ కూడా బ్రాహ్మణ పెద్దలు దీనిని స్త్రీలకు నిషిద్ధము అని నిర్ణయించడము ఎంత మూర్ఖత్వము! ఇచ్చట స్పష్టముగా గాయత్రి ఛందస్సు అనియు సవిత దేవతయనియు చెప్పబడినప్పుడు, గాయత్రిని దేవతగా ఎట్లు తీసుకురాగలవు? ఛందస్సు అనగా గానము చేయు పద్ధతియని తెలుసుకొనవలెను. 'ముక్తావిద్రుమ'... అను శ్లోకమును లౌకిక ఛందస్సుయగు శార్దూలవిక్రీడితములో వ్రాసి లౌకికులు ఈ వైదిక ఉపాసనలో చేర్చినారు.]

**ఇతి త్రైలోక్యగీతాయాం 'వర్ణవ్యవస్థా గాయత్రి సమన్వయ యోగో' నామ చతుర్దశాధ్యాయః**

**ఈ విధముగా త్రైలోక్యగీత లో పద్నాల్గవ అధ్యాయము అయిన వర్ణవ్యవస్థా గాయత్రి సమన్వయ యోగము పరిసమాప్తము**